పడిగాపులు.. పనిచేటు లేదు..!



కూడేరు మండలం కమ్మూరులో సరుకులను అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

- డీలర్ల వద్దే సరుకుల పంపిణీకి శ్రీకారం
- జిల్లాలో అట్టహాసంగా ప్రారంభం
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఇక టెన్షన్ ఉండదంటూ లబ్ధిదారుల ఆనందం

అనంతపురం టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనం ఎప్పుడు వస్తుందో అన్న పడిగాపుల కాసే తిప్పలు తప్పాయి. పనులు చేసుకుని బతికే పేదలకు కూలి పోతుందనే బాధ ఇక ఉండదు. తమకు అనుకూల సమయంలో రేషన్ షాపుల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చు. ఇంకో వైపు ఎండీయూ వాహనాల ద్వారా జరుగుతున్న మోసాలు, అక్రమ వ్యవహారాలకు చెక్‌పడనుంది. పాతపద్ధతిలో రేషన్ సరకులను డీలర్ల ద్వారానే పంపిణీకి ఆదివారం శ్రీకారం చుట్టారు. దీంతో ఇక పడిగాపులుకాయాల్సిన పనితప్పుతుందని లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



అనంతపురం నగరంలో రేషన్ సరుకులు తీసుకున్న తర్వాత సంతోషంగా వెళ్తున్న లబ్ధిదారులు

డీలర్ల పంపిణీతో టెన్షన్ తగ్గింది



నేను బార్బర్ వృత్తి చేసుకొని జీవనం గడుపుతున్నాను. ఉదయమే సెలూన్ షాపునకు వెళ్లాల్సి ఉంటుంది. బియ్యం వాహనాలు ఎప్పుడు వస్తాయోనని నెల మొదట్లో నుంచి సరకులు తీసుకునే వరకు టెన్షన్ పడాల్సి వచ్చేది. షాపులో పని వదులుకొని రావాల్సి ఉండేది. ఇపుడు డీలర్ల వద్దే 15 రోజులు ఇస్తారంట. మాకు సమయం ఉన్నపుడు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవచ్చు.

-లక్ష్మీనారాయణ,
సెలూన్ షాపు, అనంతపురం

● అట్టహాసంగా ప్రారంభం

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా డీలర్ల ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమాలను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. అనంతపురం రూరల్ మండలం కమ్మూరు గ్రామంలో రేషన్ సరకుల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి బియ్యం ఎన్ని కిలోలు తీసుకున్నారు.. ఎంతడబ్బు చెల్లించారు అని ఆరా తీశారు. ఓ లబ్ధిదారురాలి ఇంటిలో రేషన్ బియ్యంతో వండిన భోజనం తిన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పరిటాల సునీత చేతులు మీదుగా డీలర్ల నుంచి రేషన్ సరకుల పంపిణీ ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు పాల్గొని సరకుల పంపిణీ చేపట్టారు. రాయదుర్గంలో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చేతులుమీదుగా రేషన్ సరుకుల పంపిణీ మొదలు పెట్టారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాలల్లోనూ డీలర్ల ద్వారా రేషన్ సరకుల పంపిణీని అట్టహాసంగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 1645 రేషన్ షాపుల పరిధిలో 6,60,330 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు సరకులు పంపిణీ చేస్తారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డీలర్లు సరకులు పంపిణీ చేస్తారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, నడవలేని దివ్యాంగులకు ఇళ్ల వద్దే సరుకులు ఇస్తారు.



అనంతపురంలో వేలిముద్ర వేస్తున్న రేషన్ లబ్ధిదారురాలు

కూలి డబ్బు పోగొట్టుకోవాల్సి వచ్చేది



రేషన్ సరకులు కోసం ప్రతినెలా ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. వాహనం ఏ రోజు ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూసేవాళ్లం. ప్రతినెలా రేషన్ కోసం కూలి పనులకు వెళ్లకుండా కాచుకుని ఉండాల్సి వచ్చేది. డీలర్ వద్దే ఇస్తే పనులకు పోయి వచ్చిన తర్వాత రాత్రయినా సరుకులు తీసుకోవచ్చు. ఇది మాలాంటి వాళ్లకు చాలా మంచిది.

-నాగలత, కూలీ, శింగనమల

శింగనమలకు యూటర్న్ కష్టాలు

- నియోజకవర్గ కేంద్రానికి రహదారి సమస్య
- గత పాలకుల నిర్లక్ష్యం
- ఎమ్మెల్యే, ఎంపీ ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



శింగనమల రోడ్డుకు అడ్డంగా వేసిన ఇనుప డివైడర్, శివపురం పెద్దమ్మ గుడి వద్ద ఉన్న యూటర్న్

శింగనమల, జూన్1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన శింగనమలకు రహదారి సమస్య ఏర్పడింది. అనంతపురం నుంచి అమరావతికి చేపట్టిన ఎన్‌హెచ్ 544డి జాతీయ రహదారితో దారి కష్టాలు వచ్చాయి. శింగనమలకు వెళ్లే రోడ్డుకు యూటర్న్ లేకపోవడంతో అనంతపురం, తాడిపత్రి వెళ్లాలంటే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. రహదారి పనుల ప్రారంభ సమయంలో అప్పటి ఎమ్మెల్యే, ఎంపీ పట్టించుకోకపోవడంతో మరవకొమ్మ వద్ద కాకుండా శివపురం పెద్దగుడి వద్ద యూటర్న్ ఏర్పాటు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శింగనమల వెళ్లడానికి మరవకొమ్మ వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని కలెక్టర్, జాతీయ రహదారి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని తెలుస్తోంది. మరవకొమ్మ వద్ద కాకుండా అర కిలోమీటర్ దూరంలో శివపురం పెద్దమ్మగుడి వద్ద యూటర్న్‌ను ఏర్పాటు చేశారు. అనంతపురం నుంచి శింగనమలకు మరవకొమ్మ మీదనే పోవచ్చు.. శింగనమల నుంచి అనంతపురం, తాడిపత్రికి వెళ్లాలంటే శివపురం పెద్దమ్మగుడి యూటర్న్ వద్దకు పోయి రావాలి. ప్రయాణికులు శింగనమలకు వెళ్లాలంటే అర కిలోమీటర్ నడవాల్సి ఉంటుంది.

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డి నియోజకవర్గ కేంద్రం శింగనమలకు జాతీయ రహదారి నుంచి యూటర్న్ ఏర్పాటు చేయించడంలో నిర్లక్ష్యం చేశారనే విమర్శలు ఉన్నాయి. అప్పట్లో దీనిపై అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లివుంటే సమస్య పరిష్కారమయ్యేదని తెలుస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తరువాత మరవకొమ్మ వద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని శింగనమల గ్రామస్థులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకు వెళ్లారు...అప్పట్లో ఎమ్మెల్యే, కలెక్టర్ మరవకొమ్మ వద్ద యూటర్న్ పరిశీలించి ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే శాసనసభలో కూడా ప్రస్తావించారు. ఎంపీ, ఎమ్మెల్యే పలుమార్లు జాతీయ రహదారి అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినా ప్రయోజనం లేకుండాపోయింది.

రాత్రయితే భయం



అనంతపురం, తాడిప్రతికి వెళ్లి మరవకొమ్మ వద్ద బస్సు దిగాలంటే రాత్రి సమయం భయం వేస్తుంది. శింగనమలకు రావాలంటే రోడ్డు లేకుండా డివైడర్ వేశారు. డివైడర్ దాటుకోవాలంటే దాని కింద దూరి పోవాలి. లేకపోతే అరకిలోమీటర్ వెనక్కి నడుచుకుంటూ వెళ్లి తిరిగి రావాలి. రాత్రి సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

-విజయ్‌కుమార్, శింగనమల

యూటర్న్ ఏర్పాటు చేయాలి



మరవకొమ్మవద్ద యూటర్న్ ఏర్పాటు చేయాలని చాలాసార్లు అధికారులు, పాలకులకు వినతులు ఇచ్చాం. శింగనమలకు వెళ్లే రోడ్డుకు ఇప్పటికే ఇనుప డివైడర్ వేసి రోడ్డు లేకుండా చేశారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని యూటర్న్ ఏర్పాటు చేయాలి. లేకపోతే ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నాం.

-చిన్న ఓబులేసు,
ఎమార్పీఎస్ నాయకుడు, శింగనమల

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు



మరవకొమ్మ వద్ద శింగనమలకు వచ్చే రోడ్డుకు డివైడర్ వేశారు. శింగనమలకు వెళ్లాలంటే అర కిలోమిటర్ వరకు నడుచుకుంటూ పోయి దాటుకోవాలి. రోడ్డును దాటాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీయాలి. భయంభయంగా వెళ్లాల్సి వస్తోంది. యూటర్న్ ఏర్పాటుతోనే సమస్య తీరుతుంది.

- వెంకటరమణయాదవ్, శింగనమల

నాటు తుపాకీ స్వాధీనం



నాటు తుపాకీని చూపుతున్న సీఐ

రాయదుర్గం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): డీ.హీరేహాళ్ మండలం పాతహడగలి వద్ద పోలీసులు ఆదివారం వాహన తనిఖీల్లో నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్రవాహనంలో వెళ్తున్న ఇద్దరి వద్ద పట్టుబడినట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన వివరాలను వెల్లడించారు. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా కోనాపురం గ్రామానికి చెందిన బోయ గంగన్న, బసవ ద్విచక్రవాహనంలో కూడ్లూరు గ్రామంలోని దానిమ్మతోటలో పనిచేసేందుకు బయల్దేరారు. అడవి జంతువుల నుంచి రక్షణ పొందడానికి నల్లమందు, నాటు తుపాకీని అక్రమంగా తీసుకెళ్తున్నారు. వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వారిని అరెస్టు చేసి, నాటు తుపాకీతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పంట మార్పిడి ఎంతో అవసరం


శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త లక్ష్మణ్

పామిడి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి ఎంతో అవసరమని ఏఆర్ఎస్ రేకులకుంట శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్.. రైతులకు సూచించారు. మండలంలోని కండ్లపల్లి, ఎద్దులపల్లి గ్రామాల్లో ఆదివారం వికిసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలు చేపట్టారు. శాస్త్రవేత్త లక్ష్మణ్ మాట్లాడుతూ.. వ్యవసాయ సాంకేతిక, నూతన పద్ధతులతో రైతులు లాభసాటిగా వ్యవసాయం చేసుకోవచ్చన్నారు. అంతర, మిశ్రమ పంటలతో రైతులకు లాభం చేకూరుతుందన్నారు. మట్టి నమునా పరీక్షల వల్ల మొక్కలకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. మొక్కల ఎదుగుదల, దిగుబడి బాటుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినవచ్చన్నారు. అందుకు అవసరమైన ఆవు మూత్రం, పేడ ద్వారా ద్రవ, ఘన జీవామృతాలు తదితరాల తయారీని వివరించారు. అలాగే రైతులు డ్రోన్ ద్వారా వ్యవసాయ, ఇతర పంటలకు పురుగు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే రెడ్డిపల్లి శాస్త్రవేత్త సుధారాణి, డీఆర్‌డీఏ ఏపీఎం నల్లప్ప, బీటీఎం లావణ్య, ఏఈఓ శ్రీనివాసరావు, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు.

▪ తుంగభద్రకు జలకళ



తుంగభద్ర జలాశయం

డ్యాంలో 17 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

రైతుల్లో హర్షం

బొమ్మనహాళ్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ప్రారంభంలోనే తుంగభద్ర జలాశయానికి భారీగా వరద పోటెత్తుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల రోజురోజుకు నీటి నిల్వ పెరుగుతోంది. సాధారణంగా జూన్ మొదటి వారానికి తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ డెడ్ స్టోరేజీకి పడిపోతుంది. ఈ ఏడాది ఎగువ ప్రాంతాలైన శివమొగ్గ, ఆగుంబె, మలేనాడు, హరిహర తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల ముందుస్తుగా వరదనీరు జలాశయంలోకి చేరుతోంది. ఆదివారం 23,636 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. జలాశయం 17 టీఎంసీలకు చేరింది. దీంతో తుంగభద్ర జలాశయం కింద సాగు చేసుకునే రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాధారణంగా జూన్ రెండో వారంలో ఇన్‌ఫ్లో ప్రారంభమవుతుంది. ఈ ఏడాది ముందస్తుగా రుతుపవనాల రాకతో వరద పోటెత్తుతోంది. నీటి రాకతో బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సారొస్తున్నారని..

కలెక్టర్ రాక నేపథ్యంలో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

గుత్తి, జూన్1(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ వస్తున్నారని పట్టణంలో ఆగమేఘాల మీద రోడ్డు మరమ్మతులు చేపట్టారు. గుత్తికోటలోని గుర్రపుశాల వద్ద సోమవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు కలెక్టర్ వస్తున్నారు. గాంధీ సర్కిల్ నుంచి కోట వరకు రోడ్డు గుంతల మయంగా ఉండేది. కలెక్టర్ రాక నేపథ్యంలో మున్సిపల్ అధికారులు యుద్ధప్రాతిపదికన గుంతలు పూడ్చి, రోడ్డు మరమ్మతు పనులు చేశారు. ఇన్నిరోజులు తాము ఇబ్బందులు పడుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడనీ, కలెక్టర్ వస్తున్నారని ఆగమేఘాల మీద రోడ్డు వేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మంత్రి లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం

స్కూళ్ల గుర్తింపు పదేళ్లకు పెంపుపై హర్షం



లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు, రెన్యువల్ ఎనిమిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచడంపై ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు, కరస్పాండెంట్లు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ స్కూలులో ఏడీపీఎస్‌ఏ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. తర్వాత విద్యాశాఖ మంత్రి లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల నాయకులు సంగారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, సాయిగీత, కృష్ణమూర్తి, మహబూబ్‌బాషా, సురేష్‌కుమార్, గంగాధర్, గోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, రవిచంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవేంద్ర, శ్రీవత్సకుమార్ పాల్గొన్నారు.

గురువా.. ఇదేం జబ్బు..!

- వీహెచ్ సర్టిఫికెట్‌తో అధికారులకు బురిడీ
- కళ్లు బాగున్నా.. హెచ్‌ఎం ప్రమోషన్
- మరికొందరు 'లోకోమోటర్ డిజెబిలిటీ'తో దొడ్డిదారులు

7

మా బడిని తెరవండి..!

- ఎర్రబల్లి విద్యార్థుల ఎదురుచూపు
- ఏడేళ్ల క్రితం పాఠశాల మూసివేత
- 35 మంది పిల్లలు కాలినడకన అన్నమయ్య జిల్లాకు..
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ



ఎర్రబల్లిలో విద్యార్థులు

తనకల్లు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో చదువుకునే చిన్నారులు ఉన్నా పాఠశాలను మూసివేశారు. దీంతో వారు ఐదు కిలో మీటర్లు కాలినడకన పక్క జిల్లాలోని పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రాథమిక విద్యను ఉచితంగా బోధించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి విద్యాశాఖాధికారులే తూట్లు పొడుస్తున్నారు. తనకల్లు మండలం ఎర్రబల్లి గ్రామంలోని విద్యార్థులు ప్రాథమిక విద్యకు నోచుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించింది. ఈ గ్రామం మండల కేంద్రానికి సూదూరంగా ఉంది. గ్రామానికి పోవాలంటే అప్పట్లో సరైన రహదారి సౌకర్యం ఉండేదికాదు. దీంతో ప్రతిరోజూ పాఠశాలకు రావడానికి ఇబ్బందులు పడ్డ ఉపాధ్యాయులు తమ పరపతిని ఉపయోగించి గ్రామంలో విద్యార్థులు లేరని.. గ్రామస్థులతోనే సంతకాలు చేయించి, పాఠశాలను మూసివేయించారు. దీంతో ఏడేళ్ల క్రితం మూసివేసిన పాఠశాలను నేటి వరకు తెరవలేదు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు గగ్గోలు పెట్టినా, ఫిర్యాదులు చేసినా, పత్రికల్లో (మిగతా 7లో..)

జూనియర్ కళాశాలగా నసనకోట ఎంజేపీ పాఠశాల



- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హామీ
- ఎమ్మెల్యే పరిటాల సునీతపై ప్రశంసలు

7

వైసీపీ వర్గీయుల దౌర్జన్యం

- టీడీపీ మద్దతుదారుడిపై కత్తితో దాడి
- రాజకీయ కక్షల నేపథ్యంలోనే..

7

క్రైం కార్నర్

వైసీపీ వర్గీయుల దౌర్జన్యం

- టీడీపీ మద్దతుదారుడిపై కత్తితో దాడి
- రాజకీయ కక్షల నేపథ్యంలోనే..


గాయపడిన మనోజ్‌కుమార్

పెద్దపప్పూరు, జూన్‌1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనచెరువు గ్రామంలో ఆదివారం వైసీపీ వర్గీయులు దౌర్జన్యానికి దిగారు. టీడీపీ కార్యకర్త రంగయ్య కుటుంబ సభ్యులపై వైసీపీ మద్దతుదారులు నాగరాజు, మరికొందరు దాడి చేశారు. స్థానికులు, పోలీసులు వివరాల ప్రకారం.. వైసీపీకి చెందిన నాగరాజు, అతడి తమ్ముడు ఓబులేసు రాజకీయ కక్షల నేపథ్యంలో టీడీపీ మద్దతుదారులైన వెంకటరంగయ్య, అంతడి భార్య నాగరత్నతో ఆదివారం గొడవ పడ్డారు. ఇరువర్గాల వారికి గ్రామస్థులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఇంతలోనే వెంకటరంగయ్య అన్న చిన్నరంగయ్య కుమారుడు మనోజ్ కుమార్ ఇంటికి వచ్చాడు. నాగరాజు, అతడి తమ్ముడు ఇంట్లోని కత్తిని తీసుకొచ్చి మనోజ్‌పై దాడి చేశారు. నానా దుర్భాషలాడారు. 'మమ్మల్ని ఎవరూ.. ఏమీ చేయలేరంటూ' దౌర్జన్యానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. గాయపడిన మనోజ్‌ను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి ఆస్పత్రిలో మనోజ్‌ను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దపప్పూరు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

బ్రహ్మసముద్రం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక మం డలంలోని బొబ్బర్లపల్లికి చెందిన రైతు నాగరాజు (45) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు తనకున్న ఐదెకరాల పొలంతోపాటు మూడెకరాలు కౌలుకు తీసుకుని, వివిధ పంటల సాగు చేసేవాడు. పంటలు పండక, దిగుబడి బాగా వచ్చినా ధరలు లేక నష్టపోయాడు. పెట్టుబడులు కోల్పోయి, అప్పులపాలయ్యాడు. బ్యాంకు, ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.12 లక్షలకుపైగా అప్పులు చేసినట్లు కుటుంబీకులు తెలిపారు. దీంతో మనస్తాపం చెంది ఆదివారం తెల్లవారుజామున కుటుంబసభ్యులు నిద్రించిన సమయంలో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. ఉదయాన్నే కుటుంబీకులు చూసేసరికి అప్పటికే మరణించాడు. రైతుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నరేంద్ర కుమార్ కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు

చెన్నేకొత్తపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందమూరు సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు.. ధర్మవరం మండలం బడన్నపల్లికి చెందిన అమర్‌నాథ్ (25), ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ మహబూబ్‌బాషాతో కలిసి గుట్టూరులో జరుగుతున్న క్రికెట్ టోర్నీలో పాల్గొన్నారు. తిరిగి ద్విచక్రవాహనంలో ధర్మవరం వస్తుండగా చందమూరు వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో అమర్‌నాథ్ అక్కడికక్కడే మృతి చెందగా.. మహబూబ్‌బాషా తీవ్రంగా గాయపడటంతో స్థానికులు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిద్దరూ కియా అనుబంధంగా ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. మృతుడికి వివాహం కాలేదు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి పేరుతో మోసం

- ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన

గుమ్మఘట్ట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంట గ్రామంలో ఓ యువతి ఆదివారం ప్రియుడి ఇంటి ముందు పెళ్లి చేసుకోవాలంటూ ఆందోళనకు దిగింది. గ్రామానికి చెందిన బండమీద సురేష్, యువతి మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సురేష్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేశాడంటూ యువతి ఆరోపిస్తోంది. పెళ్లి చేసుకోమంటే తప్పించుకు తిరుగుతున్నాడంటూ వాపోయింది. దీంతో ఆదివారం సురేష్ ఇంటి ముందు కుటుంబసభ్యులతో కలిసి అరగంటపాటు ఆందోళనకు దిగింది. అనంతరం రాయదుర్గం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేస్తున్నట్లు గుమ్మఘట్ట పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబోలు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కనగానపల్లి మండలం పర్వతదేవరపల్లికి చెందిన కురుబ ఈశ్వరయ్య (56) చెన్నేకొత్తపల్లి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తున్నాడు. పెనుబోలు సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి సమీపంలోని డివైడర్‌కు ఢీకొని తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామగిరి ఏఎస్‌ఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ...

రాయదుర్గంరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం-అనంతపురం జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఆవులదట్ల గ్రామానికి చెందిన కవితమ్మ(36) మృతిచెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆవులదట్ల గ్రామానికి చెందిన కవితమ్మ, తమ్ముడు నవీన్ ద్విచక్రవాహనంపై గుండ్లపల్లికి వెళుతున్నారు. గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన పూలెప్ప మనవడు శివప్ప ద్విచక్రవాహనంలో ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టడంతో నలుగురు కింద పడ్డారు. కవితమ్మ, మలెప్ప, శివప్పకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా కవితమ్మ మార్గమధ్యంలో మృతిచెందింది. పూలెప్పను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

మా బడిని తెరవండి..!

(5వ పేజీ తరువాయి)

కథనాలు ప్రచురించినా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో గ్రామంలో 1నుంచి 5వ తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులు ప్రతిరోజు తమ గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నమయ్య జిల్లాలోని కందుకూరు పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లిరావడానికి పది కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని చిన్నారులు ఆవేదన చెందుతున్నారు. ప్రాథమిక పాఠశాలను పునఃప్రారింభించాలని వైసీపీ పాలనలో ఐదేళ్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. తమ చిన్నారులు ప్రతిరోజూ పది కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని, దీంతో మధ్యలోనే చదువులు ఆపివేయాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలోని పాఠశాలను పునఃప్రారంభించాలని కోరుతున్నారు.


ఎర్రబల్లి గ్రామంలోని పాఠశాల భవనం

పిల్లల కష్టాలు చూడలేకున్నాం



చిన్న పిల్లలు చదువుకునేందుకు ప్రతిరోజూ 10 కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. ఈ పిల్లల బాధ పగవాళ్లకూడా వద్దు. మా గ్రామంలో పాఠశాలను పునఃప్రారంభించాలని ప్రతియేటా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. వెంటనే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించాలని విద్యాశాఖాధికారులను కోరుతున్నా.

-శివరామ్, మాజీ సర్పంచ్, మల్లిరెడ్డిపల్లి

4 గంటలకే నిద్ర లేవాలి



ప్రతిరోజూ మా పిల్లల చదువు కోసం కుటుంబం మొత్తం ఉదయం 4 గంటలకే నిద్ర లేవాల్సి వస్తోంది. 7గంటలకే పిల్లలకు కావలసిన టిఫిన్లు సిద్ధం చేసి, అన్నమయ్య జిల్లాలోని కందుకూరులో ఉన్న పాఠశాలకు పంపాలి. మా గ్రామంలోని పాఠశాలను పునఃప్రారంభించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా స్పందించడంలేదు. మేము చదువుకోలేదు, మా పిల్లలను కూడా అలాగే వదిలేయాలా..? ఈ విషయంపై సంబంధిత అధికారులు విచారించి, న్యాయం చేయాలి.

- వెంకటేష్, విద్యార్థినుల తండ్రి, ఎర్రబల్లి

ఎన్నికలపుడు వచ్చేవాళ్లే..



ఎన్నికలు జరిగినప్పుడు మా గ్రామానికి వచ్చి పాఠశాలలను పునఃప్రారంభిస్తామని హామీ లిస్తున్నారే తప్ప, తరువాత సమస్య గురించి ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. గ్రా మంలో పాఠశాల పునఃప్రారంభించకపోతే మా పిల్లలు ఎక్కడ చదువుకోవాలి..? మా గోడును ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలి. ఈ సంవత్సరమయినా పాఠశాలను పునఃప్రారంభించాలి.

- రమణమ్మ, విద్యార్థుల అవ్వ, ఎర్రబల్లి

ప్రభుత్వం అనుమతిస్తే పునఃప్రారంభిస్తాం

ఎర్రబల్లి గ్రామంలో పాఠశాలను మూసివేసిన సంగతి మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వం అనుమతిస్తే, పాఠశాలను పునఃప్రారంభించడానికి మా వంతు సహకారం అందిస్తాం.

-లలితమ్మ, ఎంఈఓ, తనకల్లు

జూనియర్ కళాశాలగా నసనకోట ఎంజేపీ పాఠశాల

- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హామీ
- ఎమ్మెల్యే పరిటాల సునీతపై ప్రశంసలు


మాట్లాడుతున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హామీ ఇచ్చారు. ఆదివారం నసనకోటలోని ఎంజేబీ బాలికల గురుకుల పాఠశాలను ఆమె ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి, విశ్రాంతి గదులు, డైనింగ్ హాల్, వంటగది, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం బీసీల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఎంజేబీ స్కూళ్ల నిర్మాణానికి తమ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రామగిరి మండలంలోని నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను నిర్మించిందన్నారు. పాఠశాల నిర్మాణానికి మాజీ మంత్రి దివంగత పరిటాల రవీంద్ర పేరున ఆయన సతీమణి, ఎమ్మెల్యే పరిటాల సునీత 10 ఎకరాల భూమిని అందజేయడంపై అభినందించారు. ఇంటర్ విద్యకు కావాల్సిన అన్ని వసతులు ఉండటంతో విద్యార్థులు, తల్లిదండ్రుల కోరిక మేరకు ఈ గురుకుల పాఠశాల జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. బీసీ బిడ్డల విద్య కోసం పరిటాల సునీత ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. పాఠశాలకు స్థలం ఇవ్వడమే కాకుండా ఆమె సొంత నిధులు, దాతలతో కలిసి పాఠశాలకు ఏసీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, స్టౌవ్, వంట పాత్రలు, నిత్యావసర వస్తువులు ఏర్పాటు చేశారని కొనియాడారు. అనంతరం ట్రంకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు, రంగయ్య, సుధాకర్, మారుతీప్రసాద్, శ్రీధర్‌నాయుడు, గంగాధర్, శీన, ముత్యాలు, సుబ్బు, రామాంజనేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసులు


సాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి

- ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్, జూన్‌1(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3.45 లక్షల ఎకరాలను తడిపి, సాగునీటి సమస్యలకు ప్రభుత్వం పరిష్కారాలు చూపాలని ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. స్థానిక సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 32.97లక్షల ఎకరాలు వ్యవసాయ భూమి ఉందన్నారు. ఉమ్మడి జిల్లాకు 413 టీఎంసీల నీరు అవసరం అన్నారు. వర్షం, భూగర్భజలాలు, చెరువులు, బోరుబావులు, నదీజలాలు మొత్తం కలిపి 72 టీఎంసీలు మాత్రమే లభిస్తున్నాయన్నారు. ఇంకా 345 టీఎంసీల కొరత ఉందన్నారు. ఈ ప్రాంతానికి 75 సంవత్సరాల నుంచి నదీజలాలను సాధించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. గత 20 సంవత్సరాల్లో 2,874 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. 2020 నుంచి జిల్లాలో కొంత మెరుగైన వర్షాలు కురుస్తున్నాయన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు ప్రయోజనాలకు కుదించే జీఓ 404, 405లను రద్దు చేయాలన్నారు. మల్యాల నుంచి జీడిపల్లి హంద్రీనీవా మెయిన్ కాలువ సామర్థ్యాన్ని 10 వేలు, జీడిపల్లి నుంచి కిందకు 6వేలు, మడకశిర బ్రాంచ్ కెనాల్ వెయ్యి క్యూసెక్కులకు వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు, న్యాయవాది నాగరాజు, జిల్లా కార్యదర్శి సురేష్, నాయకుడు రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

జీతాలిచ్చి పనులు ప్రారంభించండి

- అడ్డుకున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు


పోలీసులతో వాదిస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు

కళ్యాణదుర్గం , జూన్ 1(ఆంధ్రజ్యోతి): రెండు నెలల జీతాలు ఇచ్చి పనులను ప్రారంభించాలని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని బోరంపల్లి వద్ద శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పైపుల మరమ్మతులు చేస్తుండగా కార్మికులు అక్కడకు వెళ్లి అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు వెళ్లి పనులు అడ్డగించవద్దని సూచించారు. సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు చెప్పి పరిష్కరించుకోవాలని తెలిపారు. 2023 డిసెంబరు, 2024 జనవరి నెలలకు సంబంధించి జీతాలు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పోలీసుల వద్ద వాపోయారు. ఈ రెండు నెలల జీతాలు చెల్లించాలని కొన్ని నెలలుగా ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. కాసేపు పోలీసులకు, కార్మికులకు వాదోపవాదాలు జరిగాయి. అనంతరం సమస్య సద్దుమణిగి యథావిధిగా పనులు కొనసాగాయి.

బాలికల క్రికెట్ జట్ల ఎంపిక


పోటీలకు హాజరైన బాలికలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బాలికల క్రికెట్ జట్ల ఎంపిక పోటీలకు భారీగా క్రీడాకారిణులు హాజరయ్యారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంతపూర్ స్పోర్ట్స్ అకాడమీ మైదానంలో జిల్లా అండర్-19, 15 బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. సెలెక్షన్ కమిటీ సభ్యులు అనిత, రాధిక, అరుణ క్రీడాకారిణులు ప్రదర్శించిన ఫిట్‌నెస్, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్, కీపింగ్ నైపుణ్యాతను పరిశీలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 72 మంది క్రీడాకారిణులు హాజరయ్యారని, ప్రతిభ ఆధారంగా తుది జట్టును ప్రకటిస్తామని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి బీమలింగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మహిళా క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి మచ్చా రామలింగారెడ్డి, ఏసీఏ సౌత్‌జోన్ మేనేజర్ సాగర్‌చౌదరి, సీనియర్ ప్లేయర్లు షాబుద్దీన్, కమలాకర్‌నాయుడు, ప్రసాద్, కోచ్‌లు నరేష్, బొమ్మన్న పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని ఇంటి నుంచి పరార్


అభిషేక్

డి.హీరేహాళ్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చదువుకోమని మందలించినందుకు అభిషేక్ అనే పదో తరగతి విద్యార్థి ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని మురడి గ్రామానికి చెందిన శరభయ్య కుమారుడు అభిషేక్ పదో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం పాఠశాలలు సెలవులు ఉన్నందున ఇంటి వద్దనే ఉన్నాడు. ప్రతి రోజూ ఆడుకుంటూ ఇంటికి ఆలస్యంగా వస్తుండేవాడని, ఆటలే కాదు ఇంటి వద్దనే ఉండి చదువుకోవాలని తండ్రి శరభయ్య కుమారుడిని మందలించాడు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయి సాయంకాలం దాకా తిరిగి రాలేదు. చాలా చోట్ల వెతికినా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

విద్యాశాఖకు ఇద్దరు ఏడీలు, ఏసీ నియామకం

- నూతన ఏసీగా వెంకటేశ్వర్లు
- గోవింద్ నాయక్ కర్నూలుకు బదిలీ


కొత్త ఏడీ శ్రీనివాసులు

అనంతపురం విద్య, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా విద్యాశాఖలో పలువురు కీలక అధికారులు బదిలీ అయ్యారు. కొందరిని నూతనంగా నియమించారు. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. అనంతపురం జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగం నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లును నియమించారు. ఇక్కడ ఏసీగా పనిచేస్తున్న గోవింద్ నాయక్‌ను కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. అదే విధంగా జిల్లాలో రెండు ఏడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)లను జిల్లాకు కొత్తగా నియమించారు. కర్నూలు డీఈఓ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న శ్రీనివాసులును ఏడీగా బదిలీ చేశారు. కడప డీఈఓ ఆఫీస్‌లో ఏడీగా పనిచేస్తున్న పఠాన్ మున్సీర్ ఖాన్‌ను అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు. డీఈఓ ఆఫీస్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సరళకుమారిని కర్నూలు జిల్లా టెక్ట్స్ బుక్స్ గోడౌన్ మేనేజర్‌గా బదిలీ చేశారు. కొత్త ఏడీ శ్రీనివాసులు ఆదివారం డీఈఓ ప్రసాద్‌బాబును కలసి రిపోర్ట్ చేసుకోగా చేరగా, కొత్త ఏసీ వెంకటేశ్వర్లు సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉంది.

గురువా.. ఇదేం జబ్బు..!

- వీహెచ్ సర్టిఫికెట్‌తో అధికారులకు బురిడీ
- కళ్లు బాగున్నా.. హెచ్‌ఎం ప్రమోషన్
- మరికొందరు 'లోకోమోటర్ డిజెబిలిటీ'తో దొడ్డిదారులు
- వినికిడి సర్టిఫికెట్లతో ఇంకొందరు సిద్ధం
- చోద్యం చూస్తున్న విద్యాశాఖాధికారులు

అనంతపురం విద్య, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో ఆయాచిత లబ్ధి కోసం కొందరు ఉపాధ్యాయులు అతి తెలివి ప్రదర్శిస్తున్నారు. వాళ్లకు లేని కొత్త జబ్బులు, వ్యాధులతో సర్టిఫికెట్లు పుట్టించుకుని బదిలీలు, ప్రమోషన్లలో ప్రయోజనం పొందుతున్నారు. కొందరు పాయింట్లు వేసుకుంటుంటే, మరికొందరు డాక్టర్ల ద్వారా ఫేక్ సర్టిఫికెట్లు పుట్టించుకుని కోరుకున్న స్థానాలు దక్కించుకుంటున్నారు. ఇటీవల ప్రమోషన్లలో ఓ టీచర్ తనకు కనబడదంటూ హెచ్‌ఎం పోస్టు కొట్టేసినట్టు సమాచారం. మరికొందరు సైతం వినికిడి సమస్య ఉన్నట్లు సర్టిఫికెట్లు పెట్టి పాయింట్లు పొంది లబ్ధిపొందాలని చూస్తున్నారు. వీరికి చెక్ పెట్టాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యాయుల జబ్బులు వేషాలు చూసినవాళ్లు... గురువా ఇదేం పాడు జబ్బు అంటూ పెదవి విరుస్తున్నారు.

కళ్లు బాగున్నా.. వీహెచ్ కింద ప్రమోషన్..?

ఆయన ఉపాధ్యాయుడు. తనకు కళ్లు సరిగ్గా కనిపించవంటూ ఇటీవల హెచ్‌ఎంగా ప్రమోషన్ పొందినట్టు సమాచారం. ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారుల్లో ఆయన పేరు మారుమోగుతోంది. గార్లదిన్నె మండలంలో పనిచేసే ఆ టీచర్ ఇటీవల వీహెచ్ కింద గ్రేడ్-2 హెచ్‌ఎంగా ప్రమోషన్ పొందినట్టు తెలుస్తోంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఓ స్కూల్‌కు హెచ్‌ఎంగా ప్రమోట్ అయినట్టు తెలుస్తోంది. కళ్లు బాగున్నా.. నిత్యం అందరితో కలిసి డీఈఓ ఆఫీస్‌కు వస్తూ వెళుతూ... ఇతర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఆయనకు ఉన్నపలంగా కళ్లు బాగాలేకపోవడం ఏంటి..? ఈ వీహెచ్ సమస్య ఏంటి అంటూ సంఘాల నాయకులు, టీచర్లు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదంతా ప్రమోషన్ కోసమేనంటూ టీచర్లు పెదవివిరుస్తున్నారు.

వందలాది మందికి ఒకే తరహా జబ్బు

టీచర్లలో చాలా మందికి పాడు జబ్బులు వచ్చాయి. బదిలీలు, ప్రమోషన్ల ముందు ఎడాపెడా పుట్టుకొచ్చాయి. ముఖ్యంగా 'లోకోమోటర్ డిజెబిలిటీ' కేటగిరీతో కూడిన జబ్బులతో వందలాది సర్టికెట్లు పెట్టుకున్నారు. సుమారు 300 నుంచి 350 మంది వరకూ ఇవే జబ్బులు ఉన్నట్లు పీహెచ్ సర్టిఫికెట్లు పెట్టుకుని పాయింట్లు పొంది బదిలీలు, ప్రమోషన్లలో లబ్ధిపొందాలని చూస్తున్నారు. బ్లైండ్, చెవుడు అంటూ కూడా మరికొందరు దొడ్డిదారి సర్టిఫికెట్లతో ఎలాగైనా లబ్ధిపొందాలని చూస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. నిజంగా జబ్బులతో ఇబ్బందిపడే టీచర్లకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ వర్తింపజేయాల్సిందే. లేని జబ్బులతో సర్టిఫికెట్లు పుట్టించుకుని వచ్చే టీచర్లు ప్రిఫరెన్షియల్ కింద లబ్ధి పొందితే.. అర్హులైన టీచర్లకు అన్యాయం జరుగుతుంది. దీనిపై కలెక్టర్ లోతైన దర్యాప్తునకు ఆదేశించాలని పలువురు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులపై వేధింపులు సరికాదు


నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయదుర్గంరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ కార్యక్రమంలో భాగంగా మూడునెలల క్రితం ఒక కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు ఉప్మా తినలేదని వారిపై రకరకాలుగా అప్పటి ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ఇబ్బందికి గురిచేశారని అతనిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు క్రాంతేష్, కోశాధికారి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం డిగ్రీ కళాశాల గేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాలలో ఏ చిన్న తప్పు చేసినా ఎన్‌సీసీ విద్యార్థులను బాధితులను చేయడం ఏమిటన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మీ పిల్లల లక్షణాలు సక్రమంగా లేవని వారికి చెప్పి ఇబ్బందికి గురిచేశారన్నారు. 2023-24లో కేవలం మిడ్‌డే పరీక్షలకు రూ.84 వేలు ఖర్చు చేయడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. కళాశాలకు తనిఖీకి వచ్చిన అధికారులే నివ్వెరపోయే పరిస్థితి నెలకొందన్నారు. కళాశాల డెస్క్‌లకు ఒకసారి పెయింట్ వేయాలంటే రూ.75 వేలు ఖర్చు చూపిస్తూ, రెండోసారి కూడా రూ.75 వేలు చూపించడమేమిటని ప్రశ్నించారు. కళాశాల స్థలంలో నర్సరీకి లీజు ఇవ్వడంతో సంవత్సరానికి రూ.45 వేలు ఆదాయం వస్తోందన్నారు. సీబీడీసీ నిధులు ఇష్టానుసారంగా వాడిన సందర్భాలున్నాయన్నారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజశేఖర్, ఉమారెడ్డి, కుమార్, అమ్రేష్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్‌కు ఫోర్త్‌టౌన్ సీఐ...

- నూతన సీఐగా జనార్దన్

అనంతపురం క్రైం,జూన్1(ఆంధ్రజ్యోతి): అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ సాయినాథ్‌ను వేకెన్సీ రిజర్వ్‌డ్(వీఆర్)కు పంపారు. ఆయన స్థానంలో పీటీసీలో పనిచేస్తున్న జనార్దన్‌ను నియమించారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరిగిన బదిలీల్లో సాయినాథ్ ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఏడాది పూర్తికాకమునుపే ఆయనను వీఆర్‌కు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. కాగా ఈ పోలీస్ స్టేషన్ సీఐ మార్పులో అధికారపార్టీ రాజకీయ జోక్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

రెండు నెలల నుంచే...

సీఐ సాయినాథ్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో జనార్దన్‌ను నియమిస్తారని గత రెండు నెలల నుంచే ప్రచారం జరిగింది. వాస్తవానికి వచ్చిన కొద్ది నెలలకే సీఐ సాయినాథ్‌ను బదిలీ చేస్తారనే ప్రచారమూ లేకపోలేదు. కానీ కొన్ని నెలలు అలా గడిచిపోయింది. సీఐ సాయినాథ్ రాజకీయ ఒత్తిళ్లు తలొగ్గి పనిచేయరనే పేరుంది. ఇక జనార్దన్ సైతం ఖాకీ నిబంధనల మేరకే పనిచేస్తారనే ప్రచారముంది. ఈ నేపథ్యంలో ఇద్దరూ ఒకే విధంగా పనిచేస్తారనుకుంటే రాజకీయ జోక్యం ఎందుకొచ్చిందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

న్యూస్ బాక్స్

విత్తన వేరుశనగకు నమోదు చేసుకోండి: ఏఓ

చెన్నేకొత్తపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల కోసం రైతులు సోమవారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ ఉదయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్‌తో వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండలానికి 1900 క్వింటాళ్ల విత్తన కాయలు ప్రభుత్వం కేటాయించిందని ఏఓ తెలిపారు.

పీఐయూ ఈఈ పీఏగా ఆనంద్‌బాబు

అనంతపురం న్యూటౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ పీఐయూ (ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్) ఈఈ పీఏగా జేఈఈ ఆనంద్‌బాబు నియమితులయ్యారు. ఇప్పటి వరకు పీఐయూ విభాగం ఈఈ పీఏగా ఉన్న డీఈఈ భరత్ ప్రకాష్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానంలో క్వాలిటీ కంట్రోల్ జేఈఈగా ఉన్న ఆనంద్‌కుమార్‌ను నియమించారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డికి ఘన నివాళి

అనంతపురం న్యూటౌన్/గార్లదిన్నె, జూన్ 1(ఆంధ్రజ్యోతి) మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డికి ఏడీసీసీ మాజీ ౖచెర్మన్ తరిమెల కోనారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘన నివాళులు అర్పించారు. ఆయన 29వ వర్ధంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని స్థానిక శ్రీకంఠం సర్కిల్‌లో, గార్లదిన్నె మండలం కల్లూరులోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన ఘన నివాళులర్పించారు. అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఐడీసీ మాజీ ౖచెర్మన్ నల్లపరెడ్డి, వెన్నపూస రామచంద్రారెడ్డి, అంజినరెడ్డి, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కల్లూరులో మాజీ సర్పంచు పెద్దన్న, బుక్కచెర్ల నల్లపరెడ్డి, రైస్‌మిల్ వెంకట్రాముడు, సుధాకర్ రెడ్డి, గట్టు రామకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, సంగప్ప, నీలం సంజీవరెడ్డి, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత రక్తదాన శిబిరం

అనంతపురం విద్య, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీధర్ సీసీఈ కోచింగ్ సెంటర్, ప్రాణదాత సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ, డీఎంహెచ్ఓ ఈబీదేవి, సైకాలజిస్టు సురేష్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యులు కాపు రామచంద్రారెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ ౖచెర్‌పర్సన్ కాపు భారతి హాజరై రక్తదానం ప్రాముఖ్యాన్ని వివరించారు. రక్తదానం చేసిన వారికి ఉచితంగా మొక్కలు అందించారు. కార్యక్రమంలో సీసీఈ డైరెక్టర్లు శేషుకుమార్, అరవింద్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి మోహన్ కృష్ణ, ఇతర సభ్యులు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి పాటుపడదాం

● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం



జేవీవీ సభ్యత్వం తీసుకుంటున్న ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక(జేవీవీ) సభ్యుల లక్ష్యం కావాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన జేవీవీ సభ్యత్వం తీసుకున్నారు. శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జేవీవీలో అనేక మంది సభ్యులుగా చేరి తమవంతు సహాయ సహకారాలందించి తోడ్పడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, కోశాధికారి మహ్మద్ జిలానీ, నాయకులు రామిరెడ్డి, తిరుపాల్, ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి నుంచి విముక్తి: ఎమ్మెల్యే

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): క్రీడాపోటీలు మానవ సంబంధాలను బలపరచడంతో పాటు ఒత్తిడి నుంచి విముక్తి కల్పిస్తాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. చార్టర్డ్ అకౌం టెంట్స్ స్పోర్ట్స్ క్లబ్ క్రికెట్ పోటీలను ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడి యంలో వల్లభ డెవలపర్స్, బౌన్స్ కిడ్స్ క్లబ్ అండ్ గేమ్ జోన్ సంయుక్త సహకారంతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే టాస్ వేసి, బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. ఫైనల్ పోటీలలో ఎస్‌బీఐ, సీఏల జట్లు చేరాయి. ఎస్‌బీఐ జట్టు విజేతగా, సీఏల జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

యువతకు స్ఫూర్తిదాయకం.. మురళీనాయక్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పాకిస్థాన్ తో జరిగిన పోరాటంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ ప్రతి యువతకు స్ఫూర్తి దాయకమని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ పేర్కొన్నారు. అమిటి క్రికెట్ క్లబ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వ హిస్తున్న వీరజవాన్ మురళీనాయక్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ పోటీల్లో వారియర్స్, కిషోర్ ఎలెవన్ జట్లు తలపడ్డాయి. కిషోర్ జట్టు 156పరుగులతో లక్ష్యాన్ని ఛేదించి టోర్నీ విజేతగా నిలిచింది. ఇందులో బ్యాటర్ సూర్య 43 బంతుల్లో నాలుగు బౌండరీలు, ఆరు సిక్సర్లతో 75పరుగులు చేసి మ్యా న్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి విజేత జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ సైనికుడు షేకన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ



హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోయకొట్టాల గ్రామంలో మునలమ్మ దేవత విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవర నిర్వహించారు. అమ్మవారికి జంతుబలులిచ్చారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ నేత పసుపుల శ్రీరామిరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఆలయం వద్ద బీజేపీ నాయకులు నీరుగంటి రామచంద్ర, నీరుగంటి నాగభూషణ, నాగరాజు, తదితరులు ఎమ్మెల్యేకి సన్మానం చేశారు.

కింద పడి రిటైర్డ్ ఉద్యోగి మృతి

అనంతపురం క్రైం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బస్సు నుంచి కిందకు దిగి వెళ్తున్న సమయంలో ఓ రిటైర్డ్ ఉద్యోగి కాలు జారి పడి తీవ్రగాయాలకు గురై మృతి చెందారు. నగరంలోని బుడ్డప్ప నగర్‌కు చెందిన షేక్‌హాజీ అబ్దుల్ కరీం(83)ఆర్టీసీలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. శనివారం తన భార్య ఫజులున్నీ సాతో కలిసి కళ్యాణదుర్గంలో ఉన్న కుమారుడు ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి ఆర్టీసీ బస్సులో వచ్చి నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదుట దిగారు. దిగిన వెంటనే కాలు జారడంతో కింద పడిన కరీం తలకు తీవ్ర గాయమైంది. ఆయనను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొం దుతూ కరీం మృతి చెందారు. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ పంపిణీపై నిఘా ఏర్పాటు చేస్తాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్
● పాత విధానంలో రేషన్ పంపిణీ ప్రారంభం



నాయక్ నగర్‌లో ఎఫ్‌పీ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీపై ఇక నుంచి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం అనంతపురం నగరంలో పలు ప్రాంతాల్లోని రేషన్ షాపుల్లో జేసీ శివనారాయణశర్మతో కలిసి పాత పద్ధతిలో ఎఫ్‌పీ షాపు వద్దనే రేషన్ పంపిణీని ప్రారంభించారు. ముందుగా నవోదయ కాలనీలోని 91, హమాలీ కాలనీలోని 96, నాయక్ నగర్‌లోని 38వ రేషన్ దుకాణాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. పాత పద్ధతిలో ఎఫ్‌పీ షాపులోనే ప్రజలకు బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలతో పాటు రేషన్ పంపిణీ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చారన్నారు. ఇంటి వద్దకే రేషన్ పేరుతో ఎండీయూ వాహనాలు ఏర్పాటు చేసి, రూ.1600 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఎప్పుడు వాహనం వస్తుందో తెలియక అనేక మంది పనులు మానుకొని, ఇంటి వద్దనే వేచి చూడాల్సి వచ్చిందన్నారు. పేదలకు రేషన్ పంపిణీ చేయకుండా పక్క రాష్ట్రాలు, విదేశాలకు అక్రమంగా తరలిస్తున్న వైనాన్ని తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత బయటపెట్టిందన్నారు. ఇక నుంచి ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రెండు పూటలా రేషన్ పంపిణీ ఉంటుందన్నారు. దివ్యాంగులు, 65 సంవత్సరాల వయస్సు దాటిన వారికి ఇంటి వద్దకే పంపిణీ చేస్తారన్నారు. ఎక్కడైనా రేషన్ సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరి, టీడీపీ నాయకులు గంగారామ్, బుగ్గయ్య చౌదరి, సరిపూటి రమణ, రాయల్ మురళి, లక్ష్మీనరసింహ, బల్లా పల్లవి, సంగా తేజస్విని, రాజారావు, నారాయణస్వామి యాదవ్, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, పీఎల్ఎన్ మూర్తి, బాలాంజినేయులు, ఫిరోజ్ అహ్మద్, ఇస్మాయిల్, నెట్టెం బాలకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, తమ్మినేని వేణు, సాకే జయప్ప, పీఎం లక్ష్మీప్రసాద్, బొమ్మినేని శివ, సుమలత, ఎఫ్‌పీ షాపు డీలర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి ఇంగ్లిష్ టీచర్ల ప్రమోషన్ల సమస్య



ఎమ్మెల్యేకి సమస్యను వివరిస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ సమస్యను టీచర్లు, సంఘాల నాయకులు ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. యూనియన్ నాయకులు, బాధిత టీచర్లు ఆదివారం నాయక్‌నగర్‌లో ఎమ్మెల్యేని నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రమోషన్ల కోసం వందలాది మంది సీనియర్ ఎస్‌జీటీలు ఎదురుచూస్తున్నారన్నారు. 2023లో సుమారు 230 మందికి తాత్కాలికంగా ప్రమోషన్లు ఇచ్చి రూ. 2500 పని చేయించుకున్నారని తెలిపారు. తర్వాత ఇతర సబ్జక్టుల వారికి ప్రమోషన్లు ఇచ్చినా కోర్టు కేసుల కారణంగా ఇంగ్లిష్ టీచర్లకు ఇవ్వలేదన్నారు. రెండేళ్లుగా న్యాయ పోరాటం చేస్తే... హైకోర్టులో సానుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ప్రస్తుతం ప్రమోషన్లు ఇవ్వడానికి 19 మాత్రమే ఖాళీలున్నాయని డీఈఓ చెబుతున్నారన్నారు. ఇటీవల డీఎస్సీలో ఎస్ఏ ఇంగ్లిష్ పోస్టులు 103 కేటాయించారని, ఇది 30 శాతం మాత్రమేనన్నారు. మిగిలిన 70 శాతం పోస్టులు అంటే సుమారు 233 ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాల్సి ఉందన్నారు. సమస్యను మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సూర్యుడు, జయపాల్‌నాయడు, శివప్రసాద్, వన్నారెడ్డి, జిలాన్ ఖాన్, చంద్ర, సూర్యనారాయణ, మల్లరాజు, క్షీరలింగేశ్వర్, ఈశ్వరయ్య, వెంకటరత్నం, రామలింగప్ప, వెంకటసుబ్బయ్య పాలొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

అనంతపురం క్లాక్‌టవర్, జూన్1(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని, యువతను పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సుబ్బారావు పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, దుష్ఫలితాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఇంట ర్నల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మాదక ద్రవ్యాల నిర్మూలన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ అసోసియేషన్ కోశాధికారి చల్లా రామాంజినేయులు, మాదక ద్రవ్యాల నిర్మూలన భారత్ ప్రతినిధి రామకృష్ణారెడ్డి, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ వినోద్‌కుమార్, డీఎస్ఏ కోచ్ నరేష్‌కుమార్, సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అవగాహనకే మోడల్ డీఎస్సీ: పీఆర్టీయూ



ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలపై అభ్యర్థులకు అవగాహన కోసమే మోడల్ డీఎస్సీ పరీక్షలు నిర్వహించినట్లు పీఆర్టీయూ నేతలు పేర్కొన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తేజ జూనియర్ కాలేజ్‌లో మోడల్ పరీక్షలు నిర్వహించారు. ప్రశ్నపత్రాలను కళాశాల ౖచెర్‌పర్సన్ ఉమాదేవి, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర నాయకులు ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 500 మంది అభ్యర్థులకు మోడల్ డీఎస్సీ నిర్వహించారు. పీఆర్టీ యూ అనంతపురం జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ప్రధానకార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఇతర నేతలు కేశవరెడ్డి, రామకృష్ణారెడ్డి, కాలేజ్ ప్రిన్సిపాల్ నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ లాసెట్

అనంతపురం క్రైం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఏపీ మోడల్ లాసెట్ పరీక్ష విజయవంతమైందని బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సాకే నరేష్ తెలిపారు. ప్రతి ఏటా ఈ మోడల్ లాసెట్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని, ఇది తొమ్మిదోదన్నారు. ఈ పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు సాధించిన యశస్విత, గౌస్, సాధిక్ హుస్సేన్‌కు బహుమతులు ప్రదానం చేశారు. హెడ్‌మాస్టర్ వెంకటస్వామి, న్యాయవాదులు రఘు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పర్వతనేని శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు



శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

బుక్కరాయసముద్రం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతినేని శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలను ఆ పార్టీ శింగనమల నియోజకవర్గం నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీ బ్యాంకు ౖచెర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డితో పాటు నియోజకవర్గంలోని పలువురు మండల కన్వీనర్లు, టీడీపీ నాయకులు హాజరై కేక్ కట్ చేశారు. పలువురు కార్యకర్తలు, టీడీపీ నేతలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు టీడీపీ నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, మండల కన్వీనర్ అశోక్, కేశన్న, రామానాయుడు, ఎస్ నారాయణస్వామి, ఓబులపతి, మల్లేష్, సురేష్‌చౌదరి, నరేంద్రయాదవ్, రెడ్డిపల్లి నాయుడు, గోపాల్‌నాయుడు, బోయఆది, వడ్డే రామక్రిష్ణతోపాటు పలు నియోజకవర్గాల నాయకులు వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పాత పద్ధతి పునరుద్ధరణ హర్షణీయం

● పలువురు డీలర్లు ● పాలకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న డీలర్లు తదితరులు

అనంతపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో ప్రభుత్వం పాత పద్ధతిని పునరుద్ధరించడం హర్షణీయమని పలువురు డీలర్లు అన్నారు. మండలంలోని పాపంపేట సర్కిల్‌లో డీలర్లు ఆదివారం ప్రస్తుత పాలక పక్షంలోని ప్రజాప్రతినిధులకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గత ప్రభుత్వం వాహనాల ద్వారా చేపట్టిన రేషన్ పంపిణీ విధానం అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా నెలలో పదిహేను రోజుల్లో ఎప్పుడైనా కార్డుదారులు రేషన్ సరుకులు తీసుకునేందుకు వీలుంటుందన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డీలర్లు రామాంజినమ్మ, సాంబశివ, బాబావలి, జెట్టి భరత్, హేమలత, శ్వేత, కుమ్మరశాలివాహన సాధికారసమితి సత్యసాయి జిల్లా కన్వీనర్ రామాంజినేయులు, గ్రామ కమిటీ అధ్యక్షులు సైఫుల్లాఖాన్, టీడీపీ నాయకులు మనోహర్ నాయుడు, దస్తగిరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

● వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్



గార్లదిన్నె సమావేశంలో మాట్లాడుతున్న శైలజానాథ్

శింగనమల/గార్లదిన్నె, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ శింగనమల నియోజక వర్గం సమన్వయ కర్త డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. ఆయన ఆదివారం శింగనమలలోని రామస్వామి దేవాలయంలో, సాయంత్రం మర్తాడు క్రాస్ వద్ద ఉన్న టీ. కన్వెన్షన్ హాల్‌లో వైసీపీ స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టే వెన్ను పోటు దినం నిరసన కార్యక్రమానికి సబంధించిన పోస్టర్లను ఆయా సమావేశాల్లో విడుదల చేశారు. శింగనమలలో వైసీపీ నాయకులు తరిమెల వంశీగోకుల్ రెడ్డి, బొమ్మన శ్రీరామిరెడ్డి, నూర్‌మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. గార్లదిన్నెలో మార్కెట్ యార్డు మాజీ ౖచెర్మన్ నారాయణరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

4న వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం క్రైం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఆయన ఆదివారం నగరంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 4వ తేదీన పాతూరులోని చెన్నకేశవస్వామి దేవాలయం నుంచి కలెక్టరేట్ వరకు వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వెన్నుపోటు దినం ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వైసీపీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవం

అనంతపురం క్రైం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): యోగా దినోత్సవాన్ని పురస్క రించుకుని ప్రజలకు అవగాహన కల్పించేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ బాలస్వామి ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ పావని ఆధ్వర్యంలో వివేకానంద యోగకేంద్ర, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సహకారంతో చిన్నారులకు యోగాలో శిక్షణ ఇచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కనగానపల్లి, జూన్1(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 1989-90 సంవత్సరంలో పదో తరగతి పూర్వపు విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమం పూర్వ విద్యార్థులు కుళ్లాయప్ప, సుబ్బరాయుడు, సీసీ సుబ్రహ్మణ్యం, నగేశ్, అక్కులప్ప ఆధ్వర్యంలో జరిగింది.



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సక్రమంగా పంపిణీ చేయండి

● అక్రమాలకు అడ్డుకట్ట
● రేషన్ పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత



రామగిరిలో సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి/చెన్నేకొత్తపల్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చౌక డిపోల ద్వారా అందిస్తున్న రేషన్ సరుకుల పంపిణీని ఎక్కడా అక్రమాలకు, విమర్శలకు తావులేకుండా నిర్వహించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత డీలర్లను ఆదేశించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆదివారం రామగిరి మండలంలోని నసనకోట పంచాయతీలో ఉన్న రేషన్‌షాపులను, చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలోని రేషన్‌షాపులో పాత విధానంలో రేషన్ పంపిణీని ప్రారంభించారు. అలాగే రామగిరి మండల వ్యాప్తంగా కానగలకుంట, రామగిరి, శ్రీహరిపురం, కుంటిమద్ది తదితర గ్రామాల్లోనూ రేషన్ దుకాణాలను ప్రారంభించారు. 65 ఏళ్లపైబడిన వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైసీపీ హయాంలో వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నామని చెప్పి పెద్ద దోపిడీకి తెరలేపారన్నారు. తమ ప్రభుత్వం రాగానే బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవ డంతో పాటు సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయిలో సమీక్ష చేసి పాత విధానానికి నిర్ణయం తీసుకున్నారన్నారు. తూకాల్లో తక్కువ ఇస్తున్నారని ఫిర్యాదులు వస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రామగిరి తహసీల్దార్ జమానుల్లాఖాన్, సీఎస్‌డీటీ కవిత, సీకేపల్లి సీఎస్‌డీటీ సావిత్రమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, నాయకులు రామ్మూర్తినాయుడు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు దండు ఓబులేశు, మండల కన్వీనర్ సుధాకర్, సీకేపల్లి మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు నాగేశ్, పేపర్ శీనా, అక్కులప్ప, దుర్గప్ప పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతో ఉజ్వల భవిష్యత్తు

● మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

అనంతపురం కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని మాజీ ఎ మ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నక్కా రామారావు యాదవ భవన్‌లో నక్కా రామారావు యాదవ చారిటబుల్ ట్రస్టు ౖచెర్మన్ పోతుల నాగరాజు అధ్యక్షతన పది, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. సభకు గుండుమల తిప్పేస్వామితోపాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడమే లక్ష్యంగా చదవాలన్నారు. ఆర్థికంగా వెనుకబడ్డ విద్యార్థులకు యాదవ చారిటబుల్ ట్రస్టు అండగా నిలుస్తుందన్నారు. ఇటీవల 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన 100 మంది విద్యార్థులకు ప్రతిభా అవార్డులను అందజేశారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ మస్తాన్ యా దవ్, కేశవయ్య, ఎస్కేయూ ప్రొఫెసర్ సత్యనారాయణ, రాజశేఖర్ యాదవ్, నాగభూషణ, శ్రీనివాసులు, నరసింహులు, నారాయణస్వామి, ఆదినారాయణ, గోపినాథ్, చక్రధర్ యాదవ్, లక్ష్మీ నరసప్ప, రామకృష్ణ, పరంధామ, జయపాల్‌యాదవ్, ఆర్డీటీ నరసింహులు, రామాంజనేయులు, కృష్ణమూర్తి, యుగంధర్ పాల్గొన్నారు.

ఉన్నత స్థాయిలో నిలవాలి : వీసీ



మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ అనిత

అనంతపురంరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్య వ్యక్తిని సమాజంలో ఉన్నత స్థాయిలో నిలబెడుతుందని ఎస్కేయూ వీసీ అనిత అన్నారు. ఆదివారం ఎ.నారాయణపురం పంచాయతీ రాయల్‌నగర్‌లోని ఈడిగ భవన్‌లో గౌడ(ఈడిగ) ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 15వ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ బొమ్మగౌని అనిత, విశిష్ట అతిథులుగా మార్కేండేయగౌడ్, ఆదిమూలపు నారాయణస్వామి, నాగేంద్రప్రసాద్, నాగభూషణం, హరిబాబుగౌడ్ హాజరై మాట్లాడారు. అనంతరం పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 60 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీసీ రమేష్‌గౌడ్, నాగేశ్వరరావు, ఆదినారాయణ, గోపాల్‌గౌడ్, కుళ్లాయిస్వామి, మనోహర్ గౌడ్, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, విజయ్‌కుమార్, రాఘవేంద్ర, మ హేంద్రకుమార్, మహేశ్వరయ్య పాల్గొన్నారు.

విద్యతో అన్నిరంగాల్లో రాణింపు



పురస్కారం అందజేస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురంరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్యతోనే అన్నిరంగాల్లో రాణించేందుకు వీలుంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం తపోవనంలోని మార్కండేయ స్వామి కల్యాణ మండపంలో పద్మశాలి ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవాన్ని సంఘం నగర అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, విజ్ఞాన్ స్కూల్ అధినేత మెరువ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. అనంతరం నగదు పురస్కారంతోపాటు మొమెంటోలు అందజేశారు. పద్మశాలి సభ్యులు వంశీకృష్ణ, విజయరామరాజు, గోరంట్ల శ్రీనివాసులు, రంగయ్య, దేవిరెడ్డి తిమ్మప్ప, సత్యనారాయణ, శివరుద్ర, చంద్రశేఖర్, వెంకటస్వామి, యుగంధర్, దేవిరెడ్డి రాము, సాయి, కాలువ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలు: ఏఎస్పీ



పురస్కారాలు అందజేస్తున్న ఏఎస్పీ

అనంతపురం సెంట్రల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్నత శిఖరాలకు చేర్చే ఏకైక మార్గం చదువు మాత్రమేనని ఏఎస్పీ అర్ల శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల సభను నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు శంకరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు ఏఎస్పీ శ్రీనివాసులుతోపాటు డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, రమణ, లెనిన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 148 మంది విద్యార్థులకు మెమెంటో, నగదు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విజయభాస్కర్, సాయిప్రసాద్, వెంకటేశ్వర్లు, వెంకటరాముడు, చలపతి, జీవి రమణ, సురేష్, సత్యనారాయణ, నాగేంద్రప్రసాద్, నగేష్, రామకృష్ణ, లింగమయ్య నాగరాజు, నాగభూషణం పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి ఆదివారం సెలవా..?

● ఉదయం పది గంటలకే మూత ● వెనుదిరిగిన రోగులు


మూతబడిన ప్రభుత్వాస్పత్రి

కుందుర్పి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములదొడ్డి ప్రభుత్వాస్పత్రి ఆదివారం పది గంటలకే మూత పడింది. చికిత్స నిమిత్తం వచ్చిన రోగులు ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది లేక మూతపడటం చూసి ఉసూరమంటూ వెనుదిరిగారు. సంబంధిత అధికారులు స్పందించి వైద్యులు వైద్య సిబ్బంది ఆస్పత్రిలో నిత్యం అందుబాటులో వుండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ధర్నా విజయవంతం చేయండి

గుంతకల్లుటౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలకు పరిష్కారం కోరుతూ సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్ ఆదివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. పోరు యాత్రలో భాగంగా పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించామని, వాటిని పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. ముఖ్యఅతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

రూ.50 వేల ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న జీకే క్రిష్ణమూర్తి

కళ్యాణదుర్గం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు పోస్టు కిష్టప్ప అనారోగ్యంతో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడిని ఆదివారం బడుగుబలహీనవర్గాల నేత జీకే క్రిష్ణమూర్తి ఆస్పత్రిలో పరామర్శించారు. అనంతరం వైద్యఖర్చుల కోసం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. నగదును బాధితుడి బంధువుకు అందించారు. శ్రీకాంత్, గణేష్, నవీన్, ప్రవీణ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణకు పద్మశ్రీ ఇవ్వడంపై హర్షం

పామిడి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్మశ్రీ అవార్డు అందజేయడంపై మండలకేంద్రంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సరస్వతీ విద్యా మందిరం వద్ద గల ప్రభుత్వ భవనంలో అభినందన సభ నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మందకృష్ణ మాదిగ చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయనకు పద్మశ్రీ అందజేయడంపై కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొడవండ్ల కుమార్ స్వామి, మునగల నల్లప్ప, వెంకటేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థికి ఆర్థిక చేయూత

పెద్దవడుగూరు, జూన్1(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న పూర్వవిద్యార్థికి స్నేహితులు, ఉపాధ్యాయులు ఆర్థిక చేయూతను అందించారు. మండలంలోని వెంకటాంపల్లికి చెందిన నాగరాజు ఇటీవల బండిశూల తిరుణాలలో ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పదో తరగతి మిత్రులు, నాటి ఉపాధ్యాయులు ఆదివారం గ్రామానికి వెళ్లి అతడిని పరామర్శించారు. తమవంతుగా రూ.లక్ష నగదు అందజేసి అండగా నిలిచారు. భవిష్యత్తులో ఏ అవసరం ఉన్నా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి, తారకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కళ్యాణదుర్గం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడాపురం పాపంపల్లి గ్రామాల మధ్య ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన శ్రీహరి, జగన్ స్నేహితులు. వీరు స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో కళ్యాణదుర్గానికి బయలుదేరారు. మార్గంమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని 108 ద్వారా కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీహరికు పరిస్థితి విషమంగా ఉంది. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.


బదిలీల్లో అధికారుల వైఖరి దారుణం: ఏపీటీఎఫ్

యాడికి, జూన్1(ఆంధ్రజ్యోతి): ప్రైమరీ స్కూళ్ల హెచ్ఎంల ఖాళీల భర్తీకి కంపల్సరీ బదిలీ కాకపోయినా, కేడర్ జూనియర్స్‌ను నిర్బంధంగా బదిలీ అప్లికేషన్ పెట్టుకోమని బదిలీల జీఓకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారుల నిరంకుశ వైఖరిని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసయాదవ్ తీవ్రంగా ఖండించారు. మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలు న్యాయమైన డిమాండ్ గురించి అడిగినప్పుడు ఇది చట్టంలో లేదని ప్రతిదానికి తిరస్కరించే డైరెక్టర్.. ఇప్పుడు ప్రైమరీ స్కూళ్ల ప్రధానోపాధ్యాయుల గురించి బదిలీల నిబంధనలకు విరుద్ధంగా కంపల్సరీ బదిలీ కానీ వారిని బలవంతంగా అప్లికేషన్ పెట్టుకోమని ఓరల్‌గా ఉత్తర్వులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పోస్టుల భర్తీలో ఎవరు సీనియర్? ఎవరు జూనియర్? అనే అంశాలు కూడా నిర్ధారణ కాకుండా విద్యాశాఖ అధికారులు గంటకో నిర్ణయం, నిమిషానికో ఒక గందరగోళం సృష్టిస్తూ ఏ విషయంలోను క్లారిటీ లేకుండా చేస్తున్నారని వాపోయారు. ఉపాధ్యాయ సంఘాలు ఒకటి కోరితే వారు మరొకటి చేస్తున్నారన్నారు. దీని ఫలితంగా ఉపాధ్యాయులు తీవ్ర అలజడికి గురవుతున్నారని తెలిపారు. ఈ విషయంలో విద్యాశాఖమంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ యాడికి మండల అధ్యక్షుడు జయప్రసాదరావు పాల్గొన్నారు. కార్యదర్శి నబీరసూల్, విశ్వనాథ్, వారిస్, రామాంజనేయులు, చంద్రశేఖర్, జయరాం, రవి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్నడ సాహిత్య సమ్మేళనం

కుందుర్పి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో 9వ కన్నడ సాహిత్య సమ్మేళనంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రామస్వామి ఆలయం నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫాదర్ ఫెర్రర్ కల్యాణ మండపంలో సమ్మేళన అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న కన్నడిగులకు, ఆంధ్రులకు ప్రాధాన్యత ఇస్తామని, ఉద్యోగ అవకాశాల్లో, ఉపాధిలో సమాన అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర కన్నడ సాహిత్య సంస్థ వాసులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఏఎస్ఐకి ఘన సన్మానం


రామారావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కణేకల్లు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ రామారావు ఉద్యోగ విరమణ పొందారు. ఇందుకు గాను ఆదివారం ఆయన్ను, ఆయన సతీమణిని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ అధికారులు, తోటి సిబ్బంది పూలమాలలు, శాలవాలతో ఘనంగా సన్మానించారు. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ నాగమధు మాట్లాడుతూ.. ఏఎస్ఐగా రామారావు చేసిన సేవల్ని కొనియాడారు. అనంతరం పలువురు రాజకీయ నాయకులు, బంధుమిత్రులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆనంద్‌రాజ్, ఆది, బీటీ రమేష్, బసవరాజు, అనిల్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు
● రేషన్ దుకాణం ద్వారా బియ్యం పంపిణీ ప్రారంభం


రాయదుర్గంలో రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ చేస్తున్న కాలవ

రాయదుర్గం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు అర్హులైన వారందరికీ తప్పక అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ ప్రారంభించిందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటింటికీ రేషన్ పంపిణీలో లబ్ధిదారులకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని తొలగించి మంచి చేయాలనే సదుద్దేశంతోనే ప్రభుత్వం పాత విధానాన్ని ఆచరణలో పెట్టినట్లు తెలిపారు. వైసీపీ పాలనలో ఇంటింటికీ వాహనం వచ్చినప్పుడు సమయానికి అందుబాటులో లేకపోతే తరువాత రేషన్ తీసుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. దుకాణానికి వెళ్లినా.. ఎప్పుడు ఇస్తారో తెలియక రేషన్ కోల్పోయేవారని అన్నారు. రేషన్ కోసం లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఇప్పటి నుంచి లబ్ధిదారులు తమ ఇళ్ల దగ్గరలోని ఏ రేషన్ దుకాణం వద్దకు అయినా వెళ్లి సరుకులు పొందవచ్చన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎప్పుడైనా వెళ్లవచ్చన్నారు. ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్‌షాపులు తెరిచి ఉంటాయన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే పంపిణీ చేయన్నుట్లు ఆయన వివరించారు. పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● గుంతకల్లు: పట్టణంలోని 11వ వార్డులో గల రేషన్ షాపులో బియ్యం పంపిణీని టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎండీయూ వాహనాల ద్వారా జరుగుతున్న రేషన్ సరఫరాలో అవినీతికి చెక్ పెట్టడానికి ప్రస్తుత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రేషన్ డోర్ డెలివరీ పేరుతో అనేక అక్రమాలు జరిగేవన్నారు. లబ్ధిదారులకు సరిగా రేషన్ అందేది కాదన్నారు. వీటికి చెక్ పెట్టడానికి ప్రస్తుత ప్రభుత్వం రేషన్‌దుకాణాల్లోనే సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టిందని తెలిపారు. తహసీల్దార్ రమాదేవి, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

● పామిడి: పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి కలిసి బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌస్‌పీరా మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల వ్యవస్థను తీసుకొచ్చి పౌరసరఫరాల వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. రేషన్ లబ్ధిదారులు ఎండీయూ వాహనం కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వాటికి చెక్ పెట్టడానికి తిరిగి రేష్ షాపుల ద్వారానే నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టిందన్నారు. మాజీ కౌన్సిలర్ చెన్నవరం మహబూబ్‌బాషా, డీలర్ బాబు, టీడీపీ నాయకులు గాదిలింగప్ప పాల్గొన్నారు.

●యల్లనూరు: పాతపేటలోని ఎస్సీకాలనీలో గల రేషన్‌షాపులో బియ్యంతో పాటు చక్కెర, కందిబేడలను టీడీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రాజా, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● బొమ్మనహాళ్: మండలంలోని కురువల్లి గ్రామంలో తహసీల్దార్ మునివేలు, స్టోర్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పయ్యావుల మోహన్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి రేషన్ షాపులో బియ్యం పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల వెంకటేశులు, టీడీపీ నాయకులు పయ్యావుల నాగరాజు, ధనంజయరెడ్డి, చంద్రరెడ్డి, తిప్పేస్వామి, డీలర్ వన్నూరుస్వామి పాల్గొన్నారు.

● కణేకల్లు: మండల కేంద్రంలోని 17వ నంబర్ రేషన్ షాపులో సరుకులు పంపిణీని టీడీపీ నాయకులు ప్రారంభించారు. మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనంద్, షేక్‌ముజ్జు, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

● బెళుగుప్ప: మండలకేంద్రంలోని ఓ రేషన్ దుకాణంలో టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పలువురు నాయకులు సరుకుల పంపిణీని ప్రారంభించారు. అలాగే గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లోనూ లబ్ధిదారులకు టీడీపీ నాయకులు సరుకులను పంపిణీ చేశారు. నాయకులు వన్నూరుస్వామి కంచిరాముడు, శివయ్య, బాలాజీ, వన్నూరుస్వామి, అనిల్ స్వామి, ధనుంజయరెడ్డి, ఈశ్వరయ్య, కృష్ణజీ, జనసేన నాయకుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

● ఉరవకొండ: పట్టణంలో రేషన్‌షాపుల్లో బియ్యం పంపిణీని టీడీపీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకుడు ప్యారంకేశవానంద ప్రారంభించారు. స్థానిక 7వ షాపు పరిధిలో దివ్యాంగులకు, వృద్ధులకు ఇంటివద్దకే వెళ్లి సరుకులను అందజేశారు. అలాగే వజ్రకరూరు మండలం ప్యాపిలిలో రేషన్‌షాపుల ద్వారా బియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో నాయకులు ప్యా పిలి నాగేంద్ర, నాగన్న, సుదర్శన్, రాజేష్, రామాంజినేయులు, ప్రభాకర్ తదతరులు పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా ఏపుగా కంపచెట్లు

● బెంబేలెత్తుతున్న వాహనదారులు


రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లు

కూడేరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్కూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల రామచంద్రపురానికి రోడ్డు సరిగా లేదు. దీంతో గ్రామస్థులు ఎక్కడికైనా ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆ గ్రామానికి 108 వాహనం రావాలన్నా ఇబ్బందికరమే. అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి నుంచి రామచంద్రపురం గ్రామంలోకి కేవలం రెండు కిలోమీటర్ల దూరం ఉంది. అయితే ఆ గ్రామానికి వెళ్లే రోడ్డు మట్టిది కావడంతో గుంతలు పెద్దఎత్తున పడ్డాయి. దీనికి తోడు ఇరువైపులా ఏపుగా కంపచెట్లు పెరిగాయి. ఏవైనా వాహనాలు వెళితే కంపలు గీసుకుంటున్నాయి. ద్విచక్రవాహనదారులు అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతులు. ఆ కంపచెట్ల నడుమ ఒంటరిగా ప్రయాణించాలన్నా.. భయాందోళన కలుగుతోందని పలువురు వాపోతున్నారు. గ్రామంలో ఎవరికైన ప్రాణపాయస్థితి వస్తే 108 వాహనం సైతం రాలేని పరిస్థితి నెలకొందంటున్నారు. దీనికితోడు గ్రామంలో తాగునీరు, వీధిలైట్లు తదితర సమస్యలు ఉన్నట్లు చెబుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి గ్రామానికి తారు రోడ్డు వేయించి, ఇరువైపులా కంపచెట్లను తొలగించాలని, అలాగే గ్రా మంలో సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

క్రీడాస్ఫూర్తితో ఉత్తమ ఫలితాలు సాధించాలి: కాలవ


డీ హీరేహాళ్‌లో విజేత జట్టుకు మొమెంటోను అందజేస్తున్న కాలవ భరత్

రాయదుర్గం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): క్రీడాస్ఫూర్తితో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని క్రికెట్ క్రీడాకారులకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. ఆయన తనయుడు కాలవ భరత్ కాలవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో కేసీఎల్- 2 పేరిట క్రికెట్ టోర్నీ నిర్వహించారు. అందులో గెలుపొందిన వారికి ఆదివారం కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు అనూహ్య స్పందన రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా అన్ని మండలాల్లో 200కుపైగా టీంలు పాల్గొంటున్నాయన్నారు. ఫైనల్ విజేతలకు రూ.లక్ష నగదు బహుమతితో పాటు ఎన్టీఆర్ ట్రోఫీ అందజేయనున్నట్లు చెప్పారు. గ్రామీణ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చక్కగా ప్రదర్శిస్తున్నారని అభినందించారు. గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని సూచించారు.

సోమలాపురం జట్టు విజయం..

డీ.హీరేహాళ్: మండలకేంద్రంలో కేసీఎల్ -2 పేరిట పది రోజుల పాటు క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో మండల వ్యాప్తంగా 32 టీంలు పాల్గొన్నాయి. వాటిల్లో సోమలాపురం, మురడి జట్ల మధ్య ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన మురడి జట్టు 9 ఓవర్లకు ఆల్ అవుట్ అయి 49 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సోమలాపురం జట్టు 5 ఓవర్లలోనే 50 పరుగులు చేసి విజయాన్ని సాధించింది. ముఖ్యఅతిథిగా ప్రభుత్వవిప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ విజేతలకు మెమెంటోలు, నగదును బహూకరించారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, ఎంపీటీసీ సాయి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పామిడిలో గురువులతో పూర్వ విద్యార్థులు


కడవకల్లులో..

పామిడి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన ఘనంగా జరిగింది. ఆ పాఠశాలలో 2006-07వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివి న విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు ఒకచోట కలిశారు. ఈ సందర్భంగా అక్కడి సరస్వతీ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలవాలతో సన్మానించారు.

పుట్లూరు: మండలంలోని కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు గెట్‌టు గెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కలుసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. తాడిపత్రి విద్యాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

బ్రహ్మసముద్రం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలవెంకటాపురం గ్రామంలో పేకాట కేంద్రంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. అందులో పేకాటాడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 4530 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. అందిన సమచారం మేరకు సిబ్బందితో దాడులు చేసినట్లు చెప్పారు.

నేడు కౌలు రైతుల ధర్నా

ఉరవకొండ,జూన్1(ఆంధ్రజ్యోతి): కౌలురైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు కౌలు రైతు సంఘం పట్టణ అధ్యక్షుడు రంగారెడ్డి, మండల కార్యదర్శి వెంకటేశులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

యాడికి, జూన్1(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటిస్థలాలు పంపిణీ చేసి, పక్కాగృహాలను నిర్మించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన సీపీఐ నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడుసెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం ఇవ్వాలని తెలిపారు. అలాగే పక్కా గృహాలను నిర్మించి ఇవ్వాలని కోరారు సూపర్‌సిక్స్ పథకాలను తక్షణమే అమలుచేయాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, నాయకులు శ్రీరాములు, లక్ష్మయ్య, ఓబులరెడ్డి, గరిడి శివన్న, కుళ్లాయిరెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

తాడిపత్రి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఏఐటీయూసీ మహాసభకు సంబంధించి కరపత్రాలను విడుదల చేసినట్లు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన జిల్లాలో భవన నిర్మాణ కార్మిక సంఘం 5వ మహాసభ జరగనుందన్నారు. అందరూ జయప్రదం చేయాలని కోరారు. భవన నిర్మాణ సంక్షేమ సంఘానికి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. సంక్షేమ బోర్డును గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. 50సంవత్సరాలు పూర్తయిన కార్మికులకు పింఛన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగరంగయ్య, నాగసుబ్బరాయుడు, రామాంజనేయులు, మద్దిలేటినాయుడు, రంగన్న పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాల అందజేత

తాడిపత్రి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణాపురం జీరోరోడ్డులో గల సా ధన కోచింగ్‌సెంటర్‌లో చేతిరాతలో నైపుణ్యం సాధించిన విద్యార్థులకు ఆదివారం ప్రశంసాపత్రాలను అందజేసినట్లు నిర్వాహకుడు రాయుడు తెలిపారు. కార్యక్రమంలో శిక్షకుడు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారురాలి ఇంట్లో కలెక్టర్ భోజనం


రేషన్ లబ్ధిదారురాలి ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్

కూడేరు, జూన్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామంలో రేషన్ షాపు పునఃప్రారంభానికి ఆదివారం వచ్చిన కలెక్టర్ వినోద్‌కుమార్ అక్క డి రేషన్ లబ్ధిదారురాలి ఇంటిలో భోజనం చేశారు. రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసిన అనంతరం ఆయన లబ్ధిదారురాలు చిట్టెమ్మ ఇంటికి వెళ్లి భోజనం చేశారు. రేషన్‌బియ్యంతో చేసిన భోజనాన్ని ఆయన చిట్టెమ్మ కుటుంబసభ్యులతో కలిసి రుచి చూశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న దీక్షిత అనే బాలికను కలెక్టర్ పలకరిస్తూ ఎంత వరకూ చదివావని అడిగారు. టెన్త్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయ్యి ఇటీవల సప్లిమెంటరీ రాశానని ఆమె తెలిపింది. ఆ అమ్మాయి టెన్త్ పాస్ అయిన తర్వాత ఇంటర్‌లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని వీఆర్వో రామకృష్ణ, తహసీల్దారుకు కలెక్టర్ సూచించారు. ఆర్డీవో కేశవనాయుడు, తహసీల్దారు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

కానరాని సందడి..

విడపనకల్లు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల్లో సరుకుల పంపిణీని నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య ఆదివారం సందడిగా పునఃప్రారంభించింది. అయితే విడపనకల్లు మండలంలో ఆసందడి కానరాలేదు. డీలర్లు ప్రజాప్రతినిధులకు, నాయకుల కు సమాచారం ఇవ్వకుండా వారికి వారే రేషన్ పంపిణీ చేశారు. ఉరవకొండ నియోజక వర్గంలోని విడపనకల్లు తప్ప మిగతా మండలాల్లో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి కేశవ్ చిత్రపటాలు ఏర్పాటు చేసి బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఇక్కడ మాత్రం ఏ గ్రామంలో కూడా ఆ సందడి లేకుండా రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఓ స్టోర్‌లో తహసీల్దార్ చంద్రశేఖరయ్య తనిఖీకి వెళ్లి అక్కడి మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటానికి పాలభిషేకం చేయించారు.

జనసేన కార్యకర్తలకు క్రియాశీలక సభ్యత్వాల కిట్లు


మాట్లాడుతున్న కదిరి శ్రీకాంత్‌రెడ్డి

యాడికి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం పలువురు జనసేన కార్యకర్తలకు ఆ పార్టీ తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్ రెడ్డి క్రియాశీలక సభ్యత్వ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన కార్యకర్తల సంక్షేమం కోసం క్రియాశీలక సభ్యత్వాల కిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పార్టీకోసం కష్టపడి, క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న కార్యకర్తల కోసం రూ.5లక్షల ప్రమాద బీమాను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా 150మంది కార్యకర్తలు క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పార్టీ మండల కన్వీనర్ సునీల్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు జాకీర్‌హుస్సేన్, శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలోకి పలువురు ముస్లింల చేరిక


పార్టీలోకి చేరిన వారితో బీజేపీ నాయకులు

తాడిపత్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలువురు ముస్లింలు బీజేపీలోకి చేరారు. స్థానిక బీజేపీ రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి నివాసంలో ఆదివారం వారు పార్టీతీర్థం పుచ్చుకున్నారు. వారికి పీవీ ప్రతాప్‌రెడ్డి కాషాయ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా బీజేపీ పనిచేస్తోందని అన్నారు. దేశరక్షణ, ప్రజాసేవ మాత్రమే పార్టీ ఎజెండా పేర్కొన్నారు. నాయకులు అంకాల్‌రెడ్డి, రంగనాథరెడ్డి, ఆంజనేయులు, శింగరి లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడి ఎన్నిక

రాయదుర్గం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా తాయి రాజశేఖర్ ఎన్నికయ్యారు. పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రత్యర్థి జయంతి సురేష్‌కి 257 ఓట్లు, తాయి శేఖర్‌కి 351 ఓట్లు పడ్డాయి. తాయి శేఖర్ 94 ఓట్ల మెజార్టీతో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక అయినట్లు ఎన్నికల అధికారి రమేష్ ప్రకటించారు.

రేషన్ షాపులో బియ్యం పంపిణీ పరిశీలన


రేషన్ బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న వెంకటశివుడు యాదవ్

గుత్తి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డులో గల రేషన్ దుకాణంలో ఆదివారం లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తుండడాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా చేపట్టిన సరుకుల పంపిణీ వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఆ వ్యవస్థ వల్ల చాలామందికి రేషన్ సరుకులు అందేవి కాదన్నారు. ఈ సమస్యలకు చెక్ పెట్టడానికి ప్రస్తుత ప్రభుత్వం రేషన్ దుకాణాల్లోనే సరుకుల పంపిణీ ప్రారంభించిందని తెలిపారు. ఇది లబ్ధిదారులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు భాస్కర్‌స్వామి, రంగారెడ్డి, నరేంద్రచౌదరి, చికెన్ శీనా, రామాంజనేయులు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో ఎండబెట్టారు..

● మొక్కలను కాపాడడంలో సిబ్బంది అలసత్వం
● నీళ్లు పోయకపోవడంతో ఎండిపోయిన వైనం
● నీరుగారిన ప్రభుత్వ లక్ష్యం


సంరక్షణ లేకపోవడంతో ఎండిపోయిన మొక్కలు

గుంతకల్లుటౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పచ్చదనం పెంపు కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కల పెంపకం పర్యవేక్షణ సిబ్బంది నిర్లక్ష్యంతో నీరు గారిపోయింది. మొక్కలు అయితే నాటారు కానీ.. వాటికి నీటిని పోయడం మరిచారు. దీంతో ప్రస్తుతం అవన్నీ ఎండిపోయాయి. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. పట్టణ శివారులోని కొనకొండ్ల రోడ్డులో గల సుంకలమ్మ ఆలయం నుంచి పోర్టర్ లైన్ దర్గా వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఇందు కోసం మున్సిపాలిటీ జనరల్ ఫండ్ కింద రూ. లక్షలు వెచ్చించినట్లు సమాచారం. రాజమండ్రి నుంచి వందల సంఖ్యలో మొక్కలను తెప్పించారు. 2023-24 సంవత్సరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, అప్పటి కమిషనర్ బండిశేషన్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని అట్టాహాసంగా ప్రారంభించారు. నాటిన మొక్కలకు చుట్టూ కంచె కూడా వేయించారు. వాటిని సంరక్షించడానికి వందల మొక్కలకు గాను ఒక వ్యక్తిని నియమించి నెలకు రూ.1500లు వరకు వేతనం చెల్లిస్తున్నట్లు సమాచారం. అయితే ఆ సిబ్బంది వాటిని సరంక్షించే బాధ్యతను గాలికి వదిలేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నీరు పోయకపోవడంతో 80శాతం మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. మిగతావి సగం వరకు ఎండిపోయాయి. కంచెలు కనబడటంలేదు. ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు వివరణ కోరగా మొక్కలను సంరక్షిస్తామని, మొక్కలు ఎండిపోవడంపై విచారణ చేయిస్తామని చెప్పారు.